ఎస్వీయూ అధికారుల తర్జనభర్జన

- అకడమిక్ కన్సల్టెంట్లను తొలగింపునకు ఈసీ అడ్డుకట్ట!


ఎస్వీయూ పరిపాలనా భవనం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న అకడమిక్ కన్సల్టెంట్ల విషయంలో ఎస్వీయూ అధికారులు ఎటూ తేల్చుకోలేని స్థితిలో తర్జనభర్జన పడుతున్నారు. వర్సిటీలో పనిచేస్తున్న 260 మంది తాత్కాలిక అధ్యాపకులకు ఇటీవల వర్సిటీ అధికారులు పెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్వ్యూలలో ప్రతిభ చూపిన అధ్యాపకులను మాత్రమే కొనసాగించి మిగిలిన వారిని తొలగించాలని నిర్ణయించారు. ఇంటర్వ్యూలు పూర్తి అయి సుమారు నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు జాబితాను విడుదల చేయలేదు. వర్సిటీ పాలకమండలి సమావేశం ఏర్పాటు చేసి ఆమోద ముద్ర వేసుకోవాలని చూసిన అధికారులకు ఎదురు దెబ్బ తగిలినట్లు తెలుస్తోంది.

కడుపుకొట్టే చర్యలు అంగీకరించం

వర్సిటీలో తాత్కాలిక అధ్యాపకులు సుమారు 5 నుంచి 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారని వారిని రోడ్డున పడేయడం దారుణమని ఈసీ సభ్యులు ముక్త కంఠంతో వర్సిటీ అధికారులకు తేల్చి చెప్పినట్లు సమాచారం. అవసరమైతే అధ్యాపకులు కొరత ఉన్న విభాగాలకు నూతన నోటిఫికేషన్‌తో మరికొంత మందిని ఎంపిక చేసుకునేందుకు తమకు అభ్యంతరం లేదని చెప్పినట్లు సమాచారం. దీంతో ఈసీ సమావేశం నిర్వహించకుండా అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించి తప్పు చేశామా అంటూ... ఏమి చేయాలో పాలుపోని స్థితిలో వర్సిటీ అధికారులు ఈ విషయాన్ని ఉన్నత విద్యామండలికి తెలియజేసినట్లు తెలుస్తోంది. ఆర్ట్స్ సబ్జెక్ట్‌లలో కొన్ని విభాగాలలో అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయన్న సాకుతో అధ్యాపకులను తొలగించేందుకు వర్సిటీ అధికారులు ఎత్తుగడ వేశారని ఇందులో భాగంగానే ఇంటర్వ్యూలు నిర్వహించి సుమారు 50 నుంచి 100మందిపై వేటు వేసేందుకు సిద్ధపడ్డారని వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

హాస్టళ్లను పరిశీలించకుండా చీకటి జీవోలు

- సమస్యల గురించి తెలియజేస్తే ఇలా చేస్తారా..?
- పేద పిల్లలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోరా
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు వినోద్


వినోద్

చంద్రగిరి: రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోగా, వాటిని రాజకీయ నాయకులు, విద్యార్థి నేతలు పరిశీలించకుండా చీకటి జీవోలు ఇవ్వడం దారుణమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు వినోద్ మండిపడ్డారు. ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై గత నెల 28 నుంచి 31 వరకు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హాస్టళ్లను పరిశీలించామన్నారు. అన్ని హాస్టళ్లలోనూ విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కనీసం తాగునీటి సౌకర్యం లేదని, ఫ్యాన్లు పనిచేయలేదని, పిల్లలు నేలపైనే పడుకుంటున్నారని తెలిపారు. మరుగుదొడ్లు జైలులో ఖైదీలకు ఏర్పాటు చేసిన దానికన్నా ఘోరంగా ఉన్నాయని తెలిపారు. దోమలతో సహవాసం చేస్తూ పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే, వాటిని పరిష్కరించకుండా ప్రభుత్వ హాస్టళ్లను విద్యార్థి నేతలు, రాజకీయ పార్టీలు సందర్శించకుండా రాత్రికి రాత్రి చీకటి జీవోలను తీసుకురావడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం అడ్డగోలుగా తీసుకొచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరుబాటకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

శెట్టిపల్లి భూ బాధితులకు కూటమి ద్రోహం

తిరుపతి కల్చరల్: శెట్టిపల్లి భూ బాధితులకు జీఓ మార్పు చేసి న్యాయం చేస్తామని తెలిపిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈనెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశంలో జీఓ మార్పు చేయకుండా ద్రోహం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో గురువారం ఆరోపించారు. గత 15 ఏళ్లుగా వేదన పడుతున్న శెట్టిపల్లి భూ బాధితులకు న్యాయం చేస్తామని వాగ్దానాలు చేసిన తెలుగు దేశం కూటమి ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ పదే పదే సమస్య పరిష్కరిస్తామని మాటలు చెప్పడం తప్ప ఆచరణలో సమస్య పరిష్కరించకపోవడం దుర్మార్గమని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి కార్పొరేటర్లకు ప్రజల భూముల అప్పగించడంపై ఉన్న శ్రద్ధ శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడంలో లేదని పేర్కొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి


తల్లిపాల విశిష్టతపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

చంద్రగిరి: బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చంద్రగిరి ఆర్‌హెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యుగంధర్ తెలిపారు. పట్టణంలో గురువారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్వీ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ యుగంధర్, డాక్టర్ సునీత మాట్లాడుతూ ప్రసవమైన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలు తాగించడం వలన బిడ్డకు శ్వాసకోస వ్యాధులు, పేగుకు సంబంధించిన వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి పెరిగి మరణాల రేటు తగ్గుతుందన్నారు. తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్లు అదుపులో ఉంటాయని తెలిపారు. తల్లికి రొమ్ము క్యాన్సర్లు రాకుండా ఉండటంతో పాటు బిడ్డకు పాలు ఇవ్వడం వలన వెంటవెంటనే గర్భం రాదని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా జయంపు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో చిన్న అంకయ్య అనే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు ప్రతి రోజు మద్యం తాగి పాఠశాలకు వచ్చి 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. యీ ఫిర్యాదులపై బాలాయపల్లి మండల విద్యా శాఖాధికారి ప్రాథమిక విచారణ నివేదికల ఆధారంగా సదరు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

నగదు అప్పగింత

తిరుమల: తిరుమలలోని ఆదిత్య బిర్లా విశ్రాంతి గృహంలో మధుశాలిని అనే భక్తురాలు గురువారం గదిలో మరిచిపోయిన రూ.39 వేలు, 600 డాలర్లు, యాపిల్ స్మార్ట్ వాచ్, వాలెట్‌ను టీటీడీ సిబ్బంది తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సదరు భక్తురాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందులో పద్మావతి విచారణ కార్యాలయ సూపరింటెండెంట్ విజయకుమార్, మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్పీడబ్ల్యూలో ఘనంగా సౌభాగ్య వ్రతం

తిరుపతి సిటీ: పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సౌభాగ్యం అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానుద్దేశించి ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ అష్టలక్ష్ముల రూప విశిష్టతలు విద్యార్థిను లు తెలుసుకోవాలన్నారు. సౌభాగ్య వ్రతం నిర్వహించడంతో ఆరోగ్యం, ఐశ్వర్యం, లక్ష్మీకటాక్షం కలుగుతుందని చెప్పారు. శ్రీదేవి, ఏఈఓ రమేష్, భద్రమణి, ఉమారాణి పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు


పవిత్రోత్సవాల్లో పాల్గొన్న టీటీడీ అధికారులు – తిరుమల

రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన సాగిస్తోందని, తమ నేతల నుంచి కార్యకర్తల వరకు అందరిపై కుట్రపూరిత దాడులతో అణచివేతకు గురి చేస్తోందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి మాట్లాడారు. సోషియల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి చురుగ్గా పని చేస్తున్నారన్న అక్కసుతో అతనిపై కూటమి నేతలు తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. అనిల్‌రెడ్డిని దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. కూటమి నేత మహేష్ యాదవ్ భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి అరాచకాలు చేస్తున్నారంటూ తప్పుడు పోస్టులు పెట్టడం దారుణమన్నారు. ఇలాంటి దుష్ప్రచారాలను తక్షణమే మానుకోవాలని, లేకుంటే లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రైవేటు కేసులు పెట్టి ఎదుర్కోవడానికి తాము వెనుకాడమని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు రవీంద్రనాథరెడ్డి, విజయకుమార్, మహదేవ్, శ్రీనివాసులురెడ్డి, సోమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీలో పదోన్నతులు ఎందుకు లేవు?

తిరుపతి కల్చరల్: ఐదేళ్లుగా తిరుమల, తిరుపతి దేవస్థానంలో ఉద్యోగులకు రావాల్సిన పదోన్నతులు ఎందుకు ఆగిపోయాయో టీటీడీ యాజమాన్యం సమాధానం చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందరాపు మురళి ఒక ప్రకటనలో సూటిగా ప్రశ్నించారు. టీటీడీలో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ పాయింట్‌లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దీర్ఘకాలంగా ఉద్యోగులకు ప్రమోషన్లు నిలిపివేయడంలో అర్థం లేదని పేర్కొన్నారు. టీటీడీలో పదోన్నతి లేకుండానే సుమారు 100 మందికిపైగా ఇటీవల రిటైరయ్యారని గుర్తు చేశారు. 100కుపైగా కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. డిగ్రీ, పీజీలు పూర్తి చేసిన వారికి కారుణ్య నియామకాల కింద నాలుగో తరగతి ఉద్యోగులుగా రిక్రూట్ చేసుకుంటున్నారని తెలిపారు. టీటీడీలో ప్రమోషన్లు ఇవ్వని కారణంగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఏర్పడ లేదని తెలిపారు. పదోన్నతులు లేక అటెండర్లు, అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలు, డెప్యూటీ ఈఓలు ప్రమోషన్ల కోసం ఏళ్ల తరబడి వేచి ఉన్నారని గుర్తు చేశారు. టీటీడీ యాజమాన్యం వెంటనే స్పందించి ఉద్యోగులు నష్టపోకుండా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

కూటమి చేతిలో కీలుబొమ్మల్లా పోలీసులు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: పవన్ అనే వ్యక్తిపై జనసేనకు చెందిన దినేష్ దాడి చేసిన ప్రత్యక్ష వీడియోలు ఉన్నప్పటికీ దినేష్‌ని అరెస్ట్ చేయకుండా పోలీసులు కూటమి నాయకుల చేతిలో కీలుబొమ్మల్లా మారారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి చేసిన దినేష్‌ని వదిలిపెట్టి పవన్ అనే వ్యక్తిని కొట్టవద్దని ప్రాధేయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడు అనిల్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. జనసేన నాయకుడు దినేష్‌ను కేసు నుంచి తప్పించేందుకు ఎమ్మెల్యే తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్నారు. అనిల్‌రెడ్డిపై తప్పుడు కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తిరుపతిలో థియేటర్ల వద్ద బ్లాక్ టికెట్లు అమ్ముకునే జనసేన రాజారెడ్డికి కూడా అభినయ్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు. కూటమి నాయకులకు పోలీసులు సైతం వత్తాసు పలుకుతుండడం బాధాకరమన్నారు. టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, నాయకులు ఇమ్రాన్‌బాషా, దినేష్‌రాయల్, సాయికుమారి, మద్దాలి శేఖర్, పసుపులేటి సురేష్, అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోండి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వ్యవహార శైలిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఎన్ఎల్ఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. విద్యార్థుల నుంచి ప్లేస్‌మెంట్ అధికారి సుమారు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, ఎన్ఎల్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు సుందరరాజు, ముఖేష్, ప్రకాష్, కుమార్ పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాలు సాధించినవారికి సన్మానం


ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సన్మానిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: శ్రీనివాస పోలీస్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు సుమారు 25 మంది పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారని ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రొబేషన్ అధికారి మోహన్ మూర్తి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్‌డాక్టర్ మల్లికార్జున, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి తదితరులు

తిరుపతి కల్చరల్: సాయి సిల్క్స్(కళామందిర్) సంస్థ ఆధ్వర్యంలో ఎయిర్ బైపాస్ రోడ్డులోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ వస్త్ర షోరూంను గురువారం అత్యంత వేడుకగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకర్త త్రిదండి అహోబిలం రామానుజ జీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పాల్గొని, కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ షోరూంను ప్రారంభించారు. కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ డైరెక్టర్ కల్యాణ్ మాట్లాడుతూ తమ సంస్థ 70వ షోరూంను ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇటీవలే సాయి సిల్క్స్(కళామందిర్) సంస్థ ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించిందని తెలిపారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, షోరూం చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు రాజేష్, సుభాష్ పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి సమష్టి కృషి

తిరుపతి తుడా: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అధికారులు అందరూ సమన్వయంతో నగర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులకు సూచించారు. గురువారం నగరంలో అభివృద్ధి పనులు, పి4 సర్వే, పన్నుల వసూళ్లు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై నగరపాలక సంస్థలో వివిధ విభాగాల అధికారులు, ఆన్‌లైన్ ద్వారా సచివాలయ సిబ్బందితో కమిషనర్ సమీక్షించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, ఏసీపీ మూర్తి, మేనేజర్ హాసీమ్, డీఈలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


మాట్లాడుతున్న స్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల హోమ్ సైన్స్ విభాగం, ఐఐసీ, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమల నారాయణమ్మ హాజరై చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. హోమ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.లక్ష్మీ, అధ్యాపకులు భద్రమణి, విద్యుల్లత, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ నాగమణి, చెంచులక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.